సాక్షి అనకాపల్లి

సోమవారం । 13 । మే । 2024



ఏవోబీలో ప్రత్యేక నిఘా 8లో

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం జరగనున్న నేపథ్యంలో ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో పోలీసు బలగాలు మోహరించాయి.



త్యాగరాజ జయంత్యుత్సవం

త్యాగరాజ స్వామి జయంత్యుత్సవాల సందర్భంగా ఆదివారం నిర్వహించిన శ్రీరామగానామృతం బృంద గానం అలరించింది. 8లో

గరిష్టం/కనిష్టం
33.0/25.5

వాతావరణం

తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కొన్నిచోట్ల కురిసే అవకాశముందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

మీరు ఓటు వేయకపోతే..



ఓటర్లలో చైతన్యవంతం తేవడానికి ఓ విద్యార్థిని వేసిన రంగవల్లిక పలువురిని ఆలోచింపజేస్తోంది. ఇఫ్ యూ దోన్ట్ ఓట్.. యూ లాస్ ద రైట్ టూ కంప్లెయిన్ అంటూ అక్షరాలలో రాసి, బ్యాలెట్ బాక్సులో ఓటు వేస్తున్నట్టుగా వేసిన ముగ్గు ఆకట్టుకుంది. సోమవారం ఎన్నికల సందర్భంగా అనకాపల్లి కస్పావీధి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఈ ముగ్గు వేసిన విద్యార్థిని స్థానికులు అభినందించారు.

- అనకాపల్లి

ఆర్టీసీ కాంప్లెక్స్ కిటకిట

- ఓటేసేందుకు స్వగ్రామాలకు పయనం



అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నర్సీపట్నం బస్సు కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని చెన్నై, హైదరాబాద్, వైజాగ్, బెంగళూరు, వంటి దూర ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి నిమిత్తం వెళ్లిన వారు కుటుంబ సమేతంగా స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. దాంతో ఆదివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ఐదు సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఓటు హక్కును వినియోగించుకునేందుకు తమ స్వగ్రామాలకు వెళ్తున్నామని పలువురు ఓటర్లు ఉత్సాహంగా చెప్పారు. ఎన్నికల విధులకు బస్సులు పంపిన నేపథ్యంలో వీరంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆటోలకు అదనపు నగదు చెల్లించి స్వగ్రామాలకు చేరుకున్నారు. అనకాపల్లి డిపో నుంచి 70 బస్సులు ఎన్నికల విధులకు వెళ్లడంతో మిగిలిన 30 బస్సులు ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా నడిపామని డిపో మేనేజర్ ఎస్.సుజాత తెలిపారు.

నేడే ఓట్ల పండగ

పోలింగ్ సమయం

ఉదయం 7 గంటల నుంచి
సాయంత్రం 6 గంటల వరకు

పోటీలో ఉన్నది

అనకాపల్లి లోక్‌సభ స్థానానికి
32 మంది

7 అసెంబ్లీ స్థానాలకు
176 మంది



యలమంచిలిలో సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

- పోలింగ్‌కు సర్వసన్నద్ధం
- మహిళలు, పురుషులకు వేర్వేరుగా పోలింగ్ స్టేషన్లు
- వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సదుపాయాలు

సాక్షి, అనకాపల్లి:

రాష్ట్ర భవిష్యత్‌ను నిర్దేశించే సార్వత్రిక ఎన్నికల సమరాంగణంలో తీర్పునిచ్చేందుకు ఓటర్లు సిద్ధమయ్యారు. నేతల తలరాతలను మార్చే ఓటు హక్కే వారి చేతిలోని వజ్రాయుధం. రాష్ట్ర విభజన తరువాత మూడోసారి జరుగుతున్న ఎన్నికలివి. ఓటర్లు రెండుసార్లు ఓటు వేయాల్సి ఉంటుంది. ఒకటి పార్లమెంటు అభ్యర్థికి.. మరొకటి అసెంబ్లీ అభ్యర్థికి.. అనకాపల్లి లోక్‌సభ స్థానానికి 32 మంది పోటీలో నిలవగా.. ఆ పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాల్లో 176 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. జిల్లాలో అత్యధికంగా అనకాపల్లి అసెంబ్లీ స్థానానికి 12 మంది పోటీలో నిలవగా.. అత్యల్పంగా చోడవరం అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఆరుగురు బరిలో నిలిచారు. 15,96,916 మంది ఓటర్లు వారి తలరాతను నిర్ణయించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరగనుంది. పార్లమెంట్ పరిధిలో 1,828 పోలింగ్ కేంద్రాల్లో 2,237 బీయూ(బ్యాలెట్ యూనిట్లు), 1,850 సీయూ (కమిషనింగ్ యూనిట్లు), 2,437 వీవీ ప్యాట్‌లు ఉపయోగిస్తున్నారు. అనకాపల్లి జిల్లా పరిధిలో 1529 పోలింగ్ కేంద్రాల్లో 1854 బ్యాలెట్ యూనిట్లు, 1850 కమిషనింగ్ యూనిట్లు, 1,993 వీవీ ప్యాట్‌లు ఉపయోగిస్తున్నారు. వీటిలో 101 బీయూ, 127 సీయూ, 139 వీవీ ప్యాట్‌లు రిజర్వ్‌గా ఉపయోగిస్తున్నారు. 340 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, 1,189 సాధారణ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

పోలింగ్ విధులకు 251 బస్సులు

జిల్లాలో పోలింగ్ సామగ్రిని, సిబ్బందిని తరలించేందుకు 251 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. ఇందులో 140 బస్సులు విశాఖ నుంచి వచ్చాయి. అనకాపల్లి జిల్లా నుంచి పాడేరు, అరకు నియోజకవర్గాలకు 39 ఆర్టీసీ బస్సులను పంపించారు. ఈ బస్సులు ఆదివారం తెల్లవారుజామున బయలుదేరాయి. 14వ తేదీ ఉదయం 9 గంటలకు యథావిధిగా తమ డిపోలకు చేరుకుంటాయి.

మహిళా ఓటర్లే అధికం

జిల్లాలో గల 6 నియోజకవర్గాల్లో 12,89,371 మంది ఓటర్లు ఉండగా..వారిలో 6,62,202 మంది మహిళా ఓటర్లు, 6,27,321 మంది పురుషులు ఉన్నారు. పురుషులు కన్నా మహిళలలే అధికంగా ఉన్నారు. అత్యధికంగా చోడవరం నియోజకవర్గంలో 1,11,863మంది ఉండగా..అత్యల్పంగా మాడుగుల నియోజకవర్గంలో 96,886 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. కొత్తగా నమోదైన 18 నుంచి 19 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న యువ ఓటర్లు 34,112 మంది, దివ్యాంగులు 21,598 మంది ఓటర్లు ఉన్నారు.

10,538 మంది పోలింగ్ సిబ్బంది

ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు 10,538 మంది సిబ్బందితోపాటు పోలీస్ సిబ్బందిని వినియోగిస్తున్నారు. 380 మంది మైక్రో అబ్జర్వర్లు, 1,529 మంది వెబ్‌కాస్టింగ్ సిబ్బంది, 1666 మంది సెక్టోరల్ ఆఫీసర్లను నియమించారు. 55 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 6 వీడియో వీవింగ్ టీంలు, 7 అకౌంటింగ్ టీంలు, 7 అసిస్టెంట్ ఎక్స్‌పెండిచర్ టీంలు, 157 సెక్టోరల్ అధికారులు, 145 రూట్ అధికారులు విధుల్లో ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు..

ఎన్నికల కమిషన్ పోలింగ్ కేంద్రాల వద్ద షామియానా, కుర్చీలకు రూ.3 వేలు మంజూరు చేసింది. అంతేకాకుండా పోలింగ్ సిబ్బంది టీ, టిఫిన్, భోజనం ఖర్చులకు రూ.5 వేల వరకు మంజూరు చేసింది. జిల్లాలో అన్ని పోలింగ్ కేంద్రాలకు కోటి 22 లక్షల 32 వేల రూపాయలు ఖర్చు చేస్తోంది. వృద్ధ, దివ్యాంగ ఓటర్లకు సహాయం అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలింగ్ స్టేషన్లో ర్యాంపు సహాయకులను, వీల్‌చైర్లను అందుబాటులో ఉంచుతున్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద..

- జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంది.
- పోలింగ్ స్టేషన్ల వద్దకు మంచినీళ్ల బాటిల్స్, ఇంకు సీసాలు, బాల్ పెన్‌లు తీసుకురావడం పూర్తిగా నిషేధం.
- మొబైల్ ఫోన్లను తీసుకురాకూడదు. పోలింగ్ ఏజెంట్లకు కూడా ఈ నియమం వర్తిస్తుంది.
- పోలింగ్ బూత్ నుంచి 100 మీటర్ల లోపల వరకు ఎటువంటి వాహనాలను అనుమతించరు.
- పోలింగ్ బూత్ నుంచి 200 మీటర్ల అవతల మాత్రమే ఓటరు స్లిప్పులకు అనుమతి
- పోలింగ్ బూత్‌కు 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలు
- 11 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా తీసుకొని వెళ్లి ఓటు వేసుకోవచ్చు.



వీవీప్యాట్‌ను తనిఖీ చేసుకుంటున్న ఎన్నికల అధికారులు

చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే చర్యలు

జిల్లావ్యాప్తంగా ఎటువంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ఫోన్ నంబర్ 08924226599 లేదా టోల్ ఫ్రీ నెంబర్ 112 లేదా 1950 లేదా దగ్గరలోని సంబంధిత పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ఫొటోస్, వీడియోస్‌తో కూడిన ఫిర్యాదులు 9440904229 నంబరుకు జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

మొత్తం ఓటర్లు
12,89,371



పురుషులు **6,27,321**

మహిళలు **6,62,022**

ఇతరులు **28**

పోలింగ్ స్టేషన్లు **1529**

అందులో సమస్యాత్మకం **340**

పోలింగ్ సిబ్బంది **10,538** మంది

మైక్రో అబ్జర్వర్లు **380** మంది

వెబ్‌కాస్టింగ్ సిబ్బంది **1529**



నర్సీపట్నంలో ప్రత్యేక పోలీసు బలగాలు



యలమంచిలి రాజీవ్ క్రీడా మైదానంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద పోలింగ్ సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది



అనకాపల్లిలో ఎన్నికల విధులకు సిద్ధం చేసిన వాహనాలు

ఆగండి.. కాస్త ఆలోచించండి!

- ఊరు మారిపోయింది
- అందమైన కలలా ఉంది
- ప్రగతికి చిరునామాగా నిలిచింది
- ఒక్కటే కోరిక మిగిలింది.. ఈ ఆనందం శాశ్వతం కావాలి



చోడవరం బాలికల హైస్కూల్లో బురదమయంగా ఉన్న ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయుల అవస్థలు (అప్పుడు)



రూ.70 లక్షల వ్యయంతో అన్ని సౌకర్యాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన అదే పాఠశాల ఆవరణ (ఇప్పుడు)



కొత్త పరిశ్రమలకు స్వాగతం పలికే ఏపీఐఐసీ వన్ స్టాప్ సర్వీస్ సెంటర్



ఎరువులు, విత్తనాల కోసం చోడవరం పట్టణంలో విత్తనాల దుకాణం వద్ద క్యూ కట్టిన రైతులు (అప్పుడు)



రైతు భరోసా కేంద్రాల్లో ఎక్కడికక్కడే ఎరువులు, విత్తనాలు అందిస్తున్న సిబ్బంది (ఇప్పుడు)

బడుల్లో బాలల కిలకిలారావాలు.. ఆస్పత్రుల్లో స్వస్థత చేకూరిన రోగులు.. రైతుకు భరోసా కల్పించే కేంద్రాలు.. గాంధీజీ కలలు గన్న గ్రామస్వరాజ్యం.. ఇది మా ఊరేనా అనిపించేలా అనేకానేక మంచి మార్పులు.. ఎక్కడ చూసినా సంతోషం, సానుకూలత.. ఇది అందమైన కల కాదు.. అంది వచ్చిన అదృష్టం.. ఇప్పుడు అందరి మదిలో మెదిలే భావన ఒకటే.. ఈ ఆనందం శాశ్వతం కావాలి.

అప్పుడప్పుడూ పీడ కలలా ఆ చీకటి రోజులు గుర్తుకొస్తుంటాయి.. జన్మభూమి కమిటీల అరాచకాలు, దౌర్జన్యాలు, మోసపూరిత వాగ్దానాలు, లంచాలు, అవినీతి జ్ఞాపకాలు ముల్లులా గుండెను గుచ్చుతుంటాయి. రైతులు విత్తనాలు, ఎరువుల కోసం బారులు తీరడం, ఆదుకునే దిక్కులేక అప్పుల పాలవ్వడం.. ఇలాంటి ఎన్నో చేదు గుర్తులు వెంటాడుతుంటాయి.

ఆ సమయంలో కాస్త గుబులుగా ఉంటుంది.. మోసగాళ్ల మాయలో పడి మన సోదరులు మళ్లీ బోల్తా పడతారేమో.. ఆచరణ సాధ్యం కాని హామీలు నమ్మి తప్పటడుగులు వేస్తారేమో.. అంతా అయ్యాక నిండా మునిగాక లబోదిబోమంటే ప్రయోజనం ఏముంటుంది..

కోవిడ్ సంక్షోభంలోనూ సంక్షేమాన్ని అందించిన అంకితభావం.. రాబోయే తరాలు బాగుపడేలా అభివృద్ధికి పునాదులు వేసే దార్శనికత.. వృద్ధుల్ని సొంత బిడ్డల్లా చూసుకునే వలంటీర్లు.. లక్షలాది ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించే సచివాలయ వ్యవస్థ, పారిశ్రామిక ప్రగతి శాశ్వతం కావాలంటే.. ప్రతి రోజూ పండగ కావాలంటే నేడే సరైన నిర్ణయం తీసుకోవాలి.

– చోడవరం, అచ్యుతాపురం

18 వేల మందిపై బైండోవర్ కేసులు

- రూ.4.5 కోట్లు స్వాధీనం
- 16 కేజీల వెండి, 6.4 గ్రాముల బంగారం స్వాధీనం
- 1150 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు
- డీఐజీ విశాల్ గున్ని వెల్లడి



పెద్ద హైస్కూల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐజీ విశాల్‌గున్ని

అనకాపల్లి : ఉత్తరాంధ్ర జిల్లాల్లో సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రశాంతమైన వాతావరణంలో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని విశాఖ రేంజ్ డీఐజీ విశాల్‌గున్ని తెలిపారు. స్థానిక జీవీఎంసీ పెద్ద హైస్కూల్ పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. విజయనగరం, అనకాపల్లి జిల్లాల్లో వివిధ పోలింగ్ కేంద్రాలను పరిశీలించడం జరిగిందని, రేంజ్ పరిధిలో కేంద్ర బలగాలు, లోకల్ పోలీసుల పర్యవేక్షణలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రేంజ్ పరిధిలో పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు, తమ సిబ్బంది ప్రత్యేక దృష్టి సాధించామని తెలిపారు. 16 కేజీల వెండి, 6.4 గ్రాముల బంగారం, రూ.4.5 కోట్లు నగదును 5 జిల్లాలో సీజ్ చేసినట్టు చెప్పారు. 18 వేల మందిపై రౌడీషీటర్, అల్లర్లకు పాల్పడుతున్న వ్యక్తులపై బైండోవర్ కేసులు, 1,150 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు పోలీస్ బందోబస్తు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల డీజీపీలతో చర్చించి సరిహద్దుల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ముంచింగ్‌పుట్, రంపచోడవరం, ఎటపాక మండలాల్లో అదనపు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కె.వి.మురళీకృష్ణ, డీఎస్పీ అప్పలరాజు పాల్గొన్నారు.

ప్రయాణికుల కోసం ఎన్నికల స్పెషల్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ ఎన్నికల కోసం వచ్చిన ప్రయాణికుల కోసం విశాఖపట్నం–బ్రహ్మపూర్– విశాఖపట్నం మధ్య స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖపట్నం–బ్రహ్మపూర్ ఫాస్ట్ పాసింజర్ సోమవారం ఉదయం 8.30గంటలకు విశాఖపట్నంలో బయల్దేరి మధ్యాహ్నం 1గంటకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్–విశాఖపట్నం ఫాస్ట్ పాసింజర్ బ్రహ్మపూర్‌లో సాయంత్రం 6.30గంటలకు బయల్దేరి రాత్రి 11.55 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ రీ షెడ్యూల్



ఆదివారం రాత్రి 11.20గంటలకు విశాఖపట్నంలో బయల్దేరవలసిన విశాఖపట్నం–లోకమాన్యతిలక్ టెర్మినస్(18519) ఎక్స్‌ప్రెస్ పెయిరింగ్ రైలు ఆలస్యం కారణంగా సుమారు 8గంటలు ఆలస్యంగా సోమవారం ఉదయం 7.20గంటలకు బయల్దేరుతుందని రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికులు మార్పులను గమనించాలని కోరారు.

క్లుప్తంగా

చెరగని సిరా వినియోగంపై వదంతులు నమ్మొద్దు

- విశాఖజిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున



మహారాణిపేట(విశాఖ): చెరగని సిరా ద్వారా ఓటర్ల వేళ్లపై వారి ఇంటి వద్దే మార్క్ చేస్తూ ఓటు హక్కును వినియోగించుకోకుండా చూడాలనే కుట్ర జరుగుతోందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని విశాఖ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ సిరాను ప్రభుత్వం మాత్రమే తయారు చేస్తుందని, భారత ఎన్నికల సంఘం వద్ద మాత్రమే అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. ప్రైవేటు వ్యక్తులు సేకరించడానికి గానీ, వినియోగించడానికి గానీ వీలులేదన్నారు. కేవలం ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యమయ్యే అధికారులు, సిబ్బంది వద్ద పోలింగ్ సమయంలో మాత్రమే అందుబాటులో ఉంటుందని, ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చే ఓటర్లకు గుర్తు పెట్టడానికి మాత్రమే ఉపయోగిస్తారని వివరించారు. ఎవరైనా ఇతర సిరాల ద్వారా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్లు అపోహలకు గురికాకుండా నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

తరలిన విద్యార్థులు.. వర్సిటీ నిర్మానుష్యం



నిర్మానుష్యంగా ఏయూ పరిపాలన భవనానికి వెళ్లే మార్గం

ఏయూ క్యాంపస్: ఓటు వేసేందుకు విద్యార్థులు తమ స్వగ్రామాలకు తరలిపోవడంతో ఆంధ్ర విశ్వవిద్యాలయం బోసిపోయింది. వర్సిటీ రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. నార్త్ క్యాంపస్‌ను పూర్తిగా ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు వినియోగిస్తున్నారు. సౌత్ క్యాంపస్ మాత్రం విద్యార్థులు లేక బోసిపోయింది. దీనికి తోడు రెండో శనివారం, ఆదివారం కలసి రావడంతో వర్సిటీ మొత్తం ఖాళీ అయిపోయింది. వర్సిటీ ఉద్యోగులు సైతం ఎన్నికల విధులకు వెళ్లిపోయారు.

నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో భక్తులు



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధికసంఖ్యలో భక్తులు వచ్చి, పిల్లపాపలతో బాలాలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. కొంతమంది భక్తులు తమ ఇళ్ల వద్ద శనివారం రాత్రంతా అమ్మవారి పాట నిర్వహించి, కాలినడకన ఆలయానికి చేరుకున్నారు.

ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వంటలు చేసుకుని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. క్యూలైన్లు అన్నీ నిండిపోవడంతో ఆలయ రహదారిపై భక్తులు బారులుతీరారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని వృద్ధులు, గర్భిణులకు ఆలయ ఈవో బండారు ప్రసాద్ ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. పట్టణ, ట్రాఫిక్ సీఐలు జి.శంకరరావు, పైడపునాయుడు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

'వుయ్' యాప్‌తో ఓటర్లకు టీడీపీ ప్రలోభాలు

తగరపువలస : 'వుయ్' యాప్ ద్వారా ఓటర్లను టీడీపీ ప్రలోభాలకు గురి చేస్తోందని ఆరోపిస్తూ వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా కార్యదర్శి కె.చంద్రమౌళి భీమిలి ఆర్డీవో కార్యాలయంతోపాటు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ రూపొందించిన ఈ యాప్‌తో ఓటర్ల డేటా చౌర్యం చేయడంతోపాటు ఓట్లు కొనుగోలుకు తెర తీసిందన్నారు. చట్టవిరుద్ధంగా ఇతర పార్టీలు, తటస్థులుగా ఉన్న ఓటర్ల వివరాలు ఈ యాప్ ద్వారా సేకరించి యూపీఐ, గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు. ఎన్నికలు సజావుగా సాగాలంటే ఇలాంటి అడ్డదార్లను అడ్డుకోవాలని చంద్రమౌళి కోరారు.

'వుయ్' యాప్‌ను తక్షణమే నిలిపివేయాలి

గాజువాక : ఎన్నికల నేపథ్యంలో టీడీపీ రూపొందించి అమల్లోకి తీసుకొచ్చిన 'వుయ్' యాప్‌ను తక్షణమే నిలిపివేయాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గాజువాక వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ తరఫున ప్రతినిధి చింతపల్లి ఈశ్వరరావు గాజువాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.లక్ష్మారెడ్డితోపాటు గాజువాక శాంతి భద్రతల విభాగం సీఐకు ఫిర్యాదు చేశారు. ఈ యాప్ ద్వారా ఓటర్ల డేటాను అక్రమంగా సేకరించడంతోపాటు వారిని ప్రలోభ పెట్టడానికి, బెదిరించడానికి ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. యాప్ ద్వారా ఓటర్ల డేటాను సేకరించి వారిని ప్రలోభపెట్టడానికి ట్రాకింగ్ బార్ కోడ్ కలిగిన ఓటరు స్లిప్పులను ఇస్తున్నారని పేర్కొన్నారు. ఈ యాప్ వల్ల ఓటర్ల యూపీఐ ఖాతాలకు ప్రత్యక్ష ఆర్థిక లావాదేవీలు నడుస్తున్నాయని ఆరోపించారు. ఈ చర్య ఎన్నికల చట్టాలను ఉల్లంఘించడమేకాక ఓటర్ల గోప్యత, చిత్తశుద్ధిని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 126 ప్రకారం ఇది నేరమని పేర్కొన్నారు. పోలింగ్, ఎన్నికల ఏజెంట్లకు సున్నితమైన ఓటరు సమాచారాన్ని వ్యూహాత్మకంగా పంపిణీ చేయడం, ఓటరు ప్రవర్తనను రహస్యంగా ప్రభావితం చేయడమేనని ఆరోపించారు. తద్వారా ఎన్నికల హక్కుల స్వేచ్ఛా వినియోగంలో జోక్యం చేసుకోవడమే అవుతుందని పేర్కొన్నారు.



భీమిలి ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి చంద్రమౌళి

జగదాంబ : టీడీపీ 'వుయ్' యాప్‌పై సీతమ్మధార తహసీల్దార్ జి.శ్రీరామ్మూర్తికి వైఎస్సార్ సీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎంసీఎం అధికారులకు మెసేజ్ పంపించి వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఆదేశాలు జారీ చేశారు.

వైభవంగా త్యాగరాజ స్వామి జయంత్యుత్సవం

మద్దిలపాలెం(విశాఖ) : త్యాగరాజ స్వామి జయంత్యుత్సవాలను మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఐవీఎస్ శాస్త్రి సంగీత సమితి ఆధ్వర్యంలో ఆకొండి వెంకటరావు శిష్య బృందం ఆలపించిన శ్రీరామ గానామృతం హృద్యంగా సాగింది. ఈ వేడుకలను త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ అధ్యక్షుడు మంతెన సత్యనారాయణ రాజు, రామకృష్ణ మిషన్ అధ్యక్షుడు స్వామి వివేకానంద మహరాజ్ ప్రారంభించారు.

అనంతరం ఆకొండి వెంకటరావు రూపకల్పన చేసిన భజనమంజరి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామానుజాచార్య జయంతి వేడుకలు



పూజలు అందుకున్న శ్రీరామానుజాచార్యులు

కొమ్మాది : స్థానిక అన్నంరాజునగర్‌లో గల శ్రీ అష్టలక్ష్మి దేవాలయంలో ఆదివారం శ్రీ రామానుజాచార్య 1007 జయంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా రామానుజాచార్యులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అష్టోత్తర శతనామార్చన, పారాయణ నిర్వహించారు. వైష్ణవ సాంప్రదాయానికి చాలా ముఖ్యమైన మహోన్నత ఆచార్యులు రామానుజాచార్యులని ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి భక్తులకు తెలిపారు.

ఏవోబీలో ప్రత్యేక నిఘా



సరిహద్దులో మోహరించిన పోలీసు బలగాలు

- అదనపు బలగాలతో నిరంతర కూంబింగ్
- అణువణువూ జల్లెడ
- పోలీసుల ఏరియా డామినేషన్
- ముమ్మరంగా తనిఖీలు
- సమస్యాత్మక కేంద్రాల్లో మోహరింపు
- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో మరింత అప్రమత్తం
- గుర్తేడు నుంచి ఈవీఎంల తరలింపునకు హెలికాప్టర్ల ఏర్పాటు



భద్రతా కారణాలతో చింతూరు పోలీసుస్టేషన్ వద్ద నిలిపివేసిన ఎన్నికల సిబ్బంది బస్సులు

చింతూరు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం జరగనున్న నేపథ్యంలో ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో పోలీసు బలగాలు మోహరించాయి.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సరిహద్దుల్లోని అటవీ ప్రాంతాలను గ్రేహౌండ్స్, సీఆర్పీఎఫ్, ఏఎస్ఎస్ బలగాలు జల్లెడ పడుతున్నాయి. అదనపు బలగాలతో కూంబింగ్ ముమ్మరం చేశాయి. మండలంలోని 40 పోలింగ్ కేంద్రాల్లో 36 కేంద్రాలను అత్యంత సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించిన పోలీసులు భద్రత చర్యలను కట్టుదిట్టం చేశారు. పోలింగ్ అనంతరం గుర్తేడు నుంచి ఈవీఎంలను తరలించేందుకు హెలికాప్టర్లను సిద్ధం చేశారు.

- మండలంలోని పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సిబ్బంది ఆదివారం సాయంత్రం ప్రత్యేక వాహనాల్లో చింతూరు చేరుకున్నారు.
- ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని తరలించే విషయంలో పోలీసులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలోని అల్లిగూడెం, పేగ పోలింగ్ కేంద్రాల సిబ్బందిని భద్రతా కారణాల దృష్ట్యా బస్సుల్లో కాకుండా ఇతర వాహనాల్లో అల్లిగూడెం పోలీసు ఔట్‌పోస్టుకు తరలించారు. పోలింగ్ సామగ్రిని ఔట్‌పోస్టులో భద్రపరచడంతో పాటు సిబ్బందికి సురక్షిత ప్రాంతంలో బస కల్పించారు. పేగ కేంద్రం సిబ్బందిని కూడా రాత్రికి అల్లిగూడెంలోనే బసచేసేలా చర్యలు చేపట్టిన పోలీసులు పోలింగ్ సమయానికి కాస్త ముందుగా వారిని అక్కడికి తరలించే ఏర్పాట్లు చేశారు.
- ఏడుగురాళ్లపల్లికి చెందిన పోలింగ్ సిబ్బంది, సామగ్రిని అక్కడి పోలీస్ ఔట్‌పోస్టుకు తరలించారు. అక్కడే బస ఏర్పాటు చేశారు.
- భద్రత కారణాల దృష్ట్యా చిడుమూరు, సింగన్నగూడెం, తుమ్మల, సరివెల, బొడ్డుగూడెం పోలింగ్ కేంద్రాల సిబ్బందిని చింతూరులోనే నిలిపివేశారు. వీరిని సోమవారం ఉదయం ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలిస్తామని పోలీసులు తెలిపారు.

ఏవోబీలో అప్రమత్తం

సీలేరు: ఎన్నికల వేళ ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో రాష్ట్ర పోలీసుశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. దీనిలో భాగంగా ముమ్మర తనిఖీలు, కూంబింగ్ నిర్వహిస్తున్నారు. జిల్లాలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన గూడెంకొత్తవీధి మండలంలోని సీలేరు, దుప్పులవాడ, ధారకొండ, గుమ్మిరేవుల, సప్పర్ల తదితర పోలింగ్ కేంద్రాల వద్ద ఇప్పటికే పోలీసు బలగాలు మోహరించాయి. సీలేరు ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది బాంబు స్క్వాడ్లతో కల్వర్టులు, బ్రిడ్జిల వద్ద తనిఖీలు చేపట్టారు.

- జీకేవీధి మండలం ధారకొండ, గుమ్మిరేవుల, దుప్పులవాడ, సీలేరు పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది ప్రత్యేక బస్సుల్లో భారీ బందోబస్తు మధ్య చేరుకున్నట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

గూడెంకొత్తవీధి: రోడ్లు వంతెనలు, కల్వర్టుల వద్ద బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టామని సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ అప్పలసూరి తెలిపారు. డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటుచేశామని వారు పేర్కొన్నారు.డీఎస్ఎండీ,హెచ్‌హెచ్ఎండీల సాయంతో అణువణువు గాలింపు చేపట్టామన్నారు.

ముంచంగిపుట్టు: మారుమూల రంగబయలు, భూసిపుట్టు, బుంగాపుట్టు పంచాయతీల్లో గత రెండు రోజులుగా మోహరించిన ప్రత్యేక బలగాలు విస్తృత కూంబింగ్ నిర్వహిస్తున్నారు. మండల కేంద్రం ముంచంగిపుట్టు నుంచి కుజభంగి, జోలాపుట్టు, డుడుమ వెళ్లే మార్గాల్లో సీఆర్‌పీఎఫ్ పోలీసులు బాంబు, డాగ్ స్క్వాడ్ వంతెనలు, కల్వర్టులను తనిఖీ చేశారు. రాత్రి పూట సైతం పోలీసులు నాలుగు రోడ్ల కూడలి వద్ద గస్తీ నిర్వహిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 114 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్ఐ రవీంద్ర తెలిపారు.

చింతపల్లి రూరల్: పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత చర్యలు చేపట్టామని చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కోరారు. పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఎక్కువ మంది గుంపులుగా తిరగడం, మాట్లాడుకోవడం నిషేధమన్నారు. అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తే అటువంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

జనసేన మహిళలపై టీడీపీ నాయకుల దాడి



మహిళల నుంచి వివరాలు సేకరిస్తున్న గాజువాక పోలీసులు

అక్కిరెడ్డిపాలెం : రాష్ట్ర వ్యాప్తంగా జనసేన, టీడీపీ మధ్య అంతర్గత విభేదాలు, ఆధిపత్య పోరు కొనసాగుతూనే ఉంది. ఇదే పరంపర జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో ఆదివారం చోటు చేసుకుంది. జనసేన మహిళా కార్యకర్తలు ఓటర్లకు డబ్బులు పంచే విషయంలో తమ ఆధిపత్యాన్ని చాటుకుంటున్నారనే అక్కసుతో టీడీపీ నాయకురాలు తన భర్తతో కలిసి దాడి చేసింది. వివరాల్లోకి వెళ్తే... గత మూడు రోజులుగా అక్కిరెడ్డిపాలెంలో టీడీపీ, జనసేన మహిళా కార్యకర్తలు ఓటర్లకు డబ్బులు పింపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో జనసేనకు చెందిన షాలిని, అరుణ మూడు బూత్‌ల పరిధిలో ఓటర్లకు డబ్బుల పంపిణీకి చర్యలు చేపట్టారు. అదే సమయంలో టీడీపీ నాయకురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి, ఆమె భర్త వేంకటేశ్వరరావు (చంటి)కి అధిష్ఠానం నుంచి వచ్చే డబ్బులు మిగలకపోవడంతోపాటు జనసేన మహిళా నాయకులు ఆధిపత్యం చెలాయిస్తున్నారన్న అక్కసుతో ఆదివారం మధ్యాహ్నం షాలిని, అరుణ వున్న కార్యాలయంలో మరో వ్యక్తితో కలిసి దాడి చేశారు. ఈ దాడితో జనసేన మహిళలకు గాయాలవడంతోపాటు దుస్తులు చిరిగిపోయాయి. వెంటనే వారు 100 నంబర్‌కు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సోమవారం పోలింగ్ జరగనున్న అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాల పక్కనే ఉన్న టీడీపీ కార్యాలయంలో దాడి జరగడంతో పరిసర ప్రాంతాల ప్రజలను పోలీసులు హెచ్చరించారు. శాంతియుతంగా ఎన్నికలకు సహకరించాలని కోరారు.

18న మార్షల్ ఆర్ట్స్‌పై ఇంటర్నేషనల్ సెమినార్



విద్యార్థులతో ఆల్ ఇండియా మార్షల్ ఆర్ట్స్ చీఫ్ ఎగ్జామినర్ అండ్ కోచ్ నరసింహారావు

తగరపువలస : జపాన్‌కు చెందిన 10వ డాన్ బ్లాక్‌బెల్ట్ గ్రహీత తకాషి మసూయమి ఆధ్వర్యంలో అక్కడి మార్షల్ ఆర్ట్స్ షోరీ టైటిల్‌కు సంబంధించి ఈ నెల 18న విశాఖ పోర్ట్ స్టేడియంలో ఇంటర్నేషనల్ సెమినార్ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు ఆదర్శనగర్‌లోని పీఎస్ఆర్ మార్షల్ ఆర్ట్స్ వేసవి శిక్షణ శిబిరంలో ఆల్ ఇండియా మార్షల్ ఆర్ట్స్ చీఫ్ ఎగ్జామినర్ అండ్ కోచ్ పి.నరసింహారావు ఆదివారం తెలిపారు. బ్రౌన్, బ్లాక్ బెల్టులు కలిగిన 150 మందికి ఈ సెమినార్‌లో ప్రవేశం ఉంటుందన్నారు. 19న అక్కడే నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

35 ఏళ్లుగా వేసవి శిక్షణ శిబిరం

పీఎస్ఆర్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ తరఫున విశాఖ, విజయనగరం, భీమిలి, పోలిపల్లి, ఎలమంచిలి తదితర ప్రాంతాల్లో ఏటా వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. తగరపువలసలో బ్లాక్ బెల్ట్ గ్రహీత బంగారు పరదేశి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరానికి 35 ఏళ్లు నిండాయన్నారు. 45 రోజులపాటు జరిగే ఈ ఉచిత శిక్షణకు పరదేశి సొంతంగా చిన్నారులకు పాలు, గుడ్లు, బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేస్తున్నారన్నారు. కోచ్‌లు బంగారు గౌతమ్, కర్రి చిట్టిబాబు పాల్గొన్నారు.

నాడు అమ్ముడుపోయి.. నేడు విలువలంటూ నీతి కబుర్లు



ప్రజలు ఇచ్చిన తీర్పును అమ్ముకుంటారు. అక్రమాల వెన్నుపోట్లతో ప్రజల్నే శాసిస్తారు. సాయం కోరిన చేతులు... సొమ్ములందిస్తేనే పని చేస్తారు. దోచుకో దానికి.. దాచుకోడానికి డీల్ కుదుర్చుకుంటారు. కోట్ల రూపాయలు ఇస్తామంటే.. ప్రజలు ఇచ్చిన ఎమ్మెల్యే పదవిని కూడా బేరం పెడతారు. అసలు రాజకీయాల్లోకి వచ్చిందే డబ్బు కోసమన్నట్లుగా వ్యవహరిస్తారు. లోకకల్యాణం కోసం ఈశ్వరుడు గరళాన్ని కంఠంలో దాచుకుంటే.. తన స్వార్థం కోసం ఈ 'ఈశ్వరి' మాత్రం.. నోట్ల కట్టల్ని దోచుకుని.. తన ఇంట్లో దాచుకుంటారు. అందుకే.. ఈసారి కూడా సారీ 'ఈశ్వరీ' అని ఓటుతో పాడేరు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారు.

- అక్రమాలు, వెన్నుపోట్లే గిడ్డి ఈశ్వరి నైజం
- ప్రజల తీర్పును గౌరవించడం తెలియని వైనం
- ప్రతి పోస్టుకూ పైసా వసూల్
- ఎమ్మెల్యే పదవినీ రూ.కోట్లకు అమ్ముకున్న గిడ్డి
- ప్రజల్ని ఏనాడూ పట్టించుకోని ఈశ్వరి
- గెలిస్తే.. షాడో ఎమ్మెల్యేదే రాజ్యం

సాక్షి, విశాఖపట్నం : రాజకీయ భవితవ్యం ఇచ్చిన వైఎస్సార్‌సీపీకి వెన్నుపోటు పొడిచి.. పాడేరు ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని రూ.30 కోట్లకు అమ్ముకున్నారు గిడ్డి ఈశ్వరి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న నమ్మకంతో.. లక్షల మంది ప్రజలు గిడ్డి ఈశ్వరిని 2014లో ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారు. కానీ.. ప్రజల తీర్పును కాలదన్ని.. కోట్లకు, పదవులకు ఆశపడి ప్లేటు ఫిరాయించడంతో ఆమెను ప్రజలు ఛీ కొట్టారు. అందుకే 2019లో టీడీపీ నుంచి పోటీ చేసినా.. గిడ్డి మనస్తత్వాన్ని గ్రహించిన పాడేరు వాసులు.. ఆమెకు ఓటుతో బుద్ధి చెప్పారు. అయినా కనీస విలువల్లేని గిడ్డి.. టీడీపీ నుంచి మళ్లీ పోటీ చేసేందుకు మంచి అనే ముసుగు కప్పుకొని ప్రజల ముందుకు వచ్చారు. ఎమ్మెల్యే పదవిని అమ్ముకొని వచ్చిన పాపపు డబ్బును ప్రజలకు పప్పు బెల్లాల్లా పంచేశారు. అయినా.. ప్రజల నుంచి మాత్రం గిడ్డికి ఎలాంటి అభయహస్తం అందడం లేదు.

పదవి పేరుతో పైసా వసూల్..

వైఎస్సార్‌సీపీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉంటూ.. ప్రజల మనిషి అని చెప్పుకునేలా వ్యవహరించిన గిడ్డి ఈశ్వరి.. అధికారంలో ఉన్న టీడీపీలో చేరగానే.. ముసుగు తీసి విశ్వరూపం చూపించారు. ఎమ్మెల్యే పదవిని అమ్మేసుకున్న ఆమె.. పార్టీ ఫిరాయించిన తరువాత అక్రమాలకు పాల్పడ్డారు. ఆర్థికంగా బలోపేతం కావడానికి ఆమె అడ్డదారులు తొక్కారు. తమ బంధువర్గానికి, అనుచర వర్గానికి ప్రాధాన్యమిచ్చి నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగాల్లో నియామకాలు చేశారు. ప్రతి పనికీ రేటు కడుతూ.. తనకు కప్పం చెల్లించాలంటూ హుకుం జారీ చేశారు. 2019 వరకు పాడేరు ప్రజలను పట్టి పీడించారు.

పోస్టింగ్ వెయ్యాలంటే రూ.లక్షలే..

ఎవరైనా.. చిన్న పని కోసం వెళ్లినా.. ఆ పని స్థాయిని బట్టి రూ.10 వేల నుంచి వసూళ్ల పర్వానికి గిడ్డి ఈశ్వరి తెగపడేవారని అప్పట్లో ప్రచారం జరిగింది. కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో ప్రత్యేకాధికారులు, ఆశ్రమ పాఠశాలల్లో వార్డెన్ నియామకాలు, అక్రమ డిప్యుటేషన్లు తమ వారికి ప్రాధాన్యం ఇప్పించి రాజకీయ లబ్ధి పొందడానికి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో పోస్టుకు రూ.5 లక్షలు వసూలు చేసినట్టు సమాచారం. ప్రభుత్వ పథకాల కేటాయింపుల్లో తన అనుయాయులకే ప్రాధాన్యమిచ్చారన్న విమర్శలను గిడ్డి ఈశ్వరి ఎదుర్కొన్నారు. నిరుద్యోగ గిరిజన యువతకు ఉపాధి కల్పించడం కోసం అమలు చేస్తున్న నేషనల్ షెడ్యూల్డ్ ట్రైబుల్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌టీఎఫ్‌డీసీ) పథకం ద్వారా ఇన్నోవా, బొలేరో వాహనాలను తమకు నచ్చిన వారికే ఈశ్వరి ఇప్పించుకున్నారన్న అప్పట్లో విమర్శలు వచ్చాయి. నిజమైన లబ్ధిదారులకు మొండిచేయి చూపించారు. నిబంధనలకు తూట్లు పొడిచి తాను సూచించిన 16 మందికి ఈ వాహనాల్ని గుట్టుచప్పుడుగా పంపిణీ చేసినట్టు ఆమె విమర్శలను ఎదుర్కొన్నారు. రాజకీయ దురుద్దేశంతో బినామీ పేర్లతో గిరిజనేతరులకు కూడా ఈ వాహనాలు ఇప్పించినట్టు అప్పటిలో ప్రచారం జరిగింది. గుత్తులపుట్టులో విద్యుత్ కార్యాలయంలో షిఫ్ట్ ఆపరేటర్లు, కాంట్రాక్టు సిబ్బంది నియామకాలు రూ.లక్షలకు గిరిజనేతరులకు విక్రయించుకున్నారు. ఈ విషయంపై అనేక మార్లు ఫిర్యాదులు వెళ్లినా చంద్రబాబు ప్రభుత్వం కనీసం స్పందించకుండా.. గిడ్డిని ఇంకా అక్రమాలు చెయ్యాలంటూ ప్రోత్సహించింది. ఇలా.. గిడ్డి అక్రమాల చిట్టా చదువుతూ పోతే.. వంజంగి కొండంత ఎత్తుగా ఉంటుంది.

షాడో ఎమ్మెల్యేదే పెత్తనం..

ఆలులేదు.. చూలులేదు అన్నసామెత మాదిరిగా.. టికెట్ కోసమే అష్టకష్టాలు పడిన గిడ్డి ఈశ్వరి.. అష్ట విన్యాసాలు చేసినా.. ప్రజలు నమ్మే పరిస్థితుల్లో కనిపించడం లేదు. ఎందుకంటే.. సొంతపార్టీ శ్రేణులే హర్షించడం లేదు. గెలిస్తే.. ఎమ్మెల్యే తాను కాదనీ.. పెత్తనమంతా.. ఓ సార్‌కు అప్పగిస్తారని పార్టీ నేతలే విమర్శలు చేస్తున్నారు. ఇటీవల ఆమెకు టీడీపీ టికెట్‌ను చివరి నిమిషంలో ఓకే చేసిన తర్వాత.. ఆ పార్టీ శ్రేణులు అభినందనలు చెప్పేందుకు గిడ్డి ఈశ్వరి దగ్గరికి వస్తే.. ఆమె.. సదరు సారుకే పుష్పగుచ్ఛాలు ఇవ్వండి.. ఇకపై ఆయనే అన్నీ చూసుకుంటారంటూ సూచించడంతో అంతా మండిపడుతున్నారు.

ఇప్పుడే ఇంత ఓవరాక్షన్ చేస్తుంటే.. గెలిస్తే.. ఎవ్వర్నీ పట్టించుకోరేమోనని టీడీపీ నేతలు అసహ్యించుకుంటున్నారు. మరోవైపు.. గిడ్డి ఈశ్వరి ఆగడాలు రోజు రోజుకీ శృతి మించుతుండటంతో.. ఈశ్వరీ.. ఈసారి కూడా మళ్లీ సారీ అంటూ పాడేరు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు.

ఓటుకు వేళాయె..


అనకాపల్లి ఎస్పీ కార్యాలయం వద్ద పోలింగ్ సిబ్బంది


పోలింగ్ ఏర్పాట్లపై ఆర్వోతో చర్చిస్తున్న పరవాడ డీఎస్పీ సత్యనారాయణ

- ఈవీఎంలతో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- సమస్యాత్మక కేంద్రాల వద్ద భారీ బందోబస్తు

యలమంచిలి రూరల్/అనకాపల్లి: ఓట్ల పండగకు వేళయింది. ఇందుకోసం ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో 12 మంది, యలమంచిలిలో 10 అభ్యర్థులు బరిలో ఉన్నారు. యలమంచిలి నియోజవర్గంలో 246, అనకాపల్లి అసెంబ్లీ 251 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఈవీంఎంలు,వీవీప్యాట్‌లు,ఇతర సామగ్రిని ఎన్నికల సిబ్బందికి అధికారులు పంపిణీ చేశారు ఆ సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.

యలమంచిలి నియోజకవర్గ వివరాలు...

నియోజకవర్గంలో 21 రూట్లను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్,అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు,ఇద్దరు పోలింగ్ అధికారులు,వెబ్‌క్యాస్టింగ్ అధికారి,గార్డులు విధులు నిర్వహించనున్నారు. పీవోలు 246 మంది, ఏపీవోలు 246 మంది ,ఓపీవోలు 984 మందిని నియమించారు. వీరితోపాటు 21 మంది సెక్టార్, 21 మంది రూట్ అధికారులు, 58 మంది మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించనున్నారు.ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఆశా వర్కర్, ఏఎన్‌ఎంలు విధులు నిర్వహిస్తారు.పోలింగ్ కేంద్రాల వద్ద మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచినట్టు అధికారులు తెలిపారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.మనోరమ పర్యవేక్షించారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా సుమారు 500 మంది పోలీసులు,కేంద్ర బలగాలు,అదనపు బలగాలను సిద్ధంగా ఉంచినట్టు సీఐ గఫూర్ తెలిపారు.

ఓటర్లు ...

నియోజకవర్గంలో మొత్తం 2,06,394 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో పురుష ఓటర్లు 1,00,407 మంది కాగా, మహిళలు 1,05,978, ఇతరులు 9 మంది ఉన్నారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈసారి 5 ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఆర్వో మనోరమ తెలిపారు. పోలింగ్ శాతం పెంచడానికి మహిళలు, యువత, దివ్యాంగులకు ప్రత్యేక వసతులను కల్పించారు. ఈ కేంద్రాల వద్ద బెలూన్లు,తోరణాలు, అందమైన కార్పెట్లు వేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

అనకాపల్లి నియోజకవర్గంలో...

నియోజకవర్గంలోని 251 పోలింగ్ కేంద్రాల్లో 14 కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. ఈ కేంద్రాల్లో ఒక వీడియో గ్రాఫర్, మైక్రో అబ్జర్వర్ ఉంటారు. మిగిలిన పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల సరళిని వెబ్‌క్యాస్టింగ్ ద్వారా పరిశీలకులు పర్యవేక్షిస్తారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ ఎం.జాహ్నవి, డీఎస్పీ అప్పలరాజు తదితరులు నియోజకవర్గంలో ఆయా ప్రాంతాలకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తారు. కేంద్ర బలగాలతో పాటు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. అనకాపల్లి మండలంలోని 32 పంచాయతీల్లోను, జోన్ పరిధిలో 5 వార్డుల్లో పోలింగ్ కేంద్రాలకు ఆదివారం ఎన్నికల సిబ్బంది చేరుకున్నారు. ఒక ఎన్నికల పరిశీలకుడు, 25మంది సెక్టోరియల్ ఆఫీసర్లు, 25మంది రూట్ ఆఫీసర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనున్నారు. నాలుగు చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. బందోబస్తు విధుల్లో ఆరుగురు సీఐలు, 20 మంది ఎస్‌ఐలు, 700 మంది కానిస్టేబుళ్లు, 73 మంది సచివాలయం మహిళా సంరక్ష కార్యదర్శులు, 90 మంది కేంద్రబలగాల సిబ్బంది పాల్గొంటున్నారు.వీరితో పాటు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు,మూడు వీడియో సర్వేయవల్ బృందాలు, మూడు స్టాటిక్ సర్వేయల్ బృందాలను నియమించారు.


ఎన్నికల సామగ్రితో బస్సెక్కుతున్న మహిళా సిబ్బంది


అనకాపల్లి ఎన్టీఆర్ క్రీడామైదానంలో సిద్ధంగా ఉన్న వ్యాన్లు

ఓటర్లు ఇలా..

అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో 2,13,714 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 1,03,088 మంది, మహిళలు 1,10,621 మంది, ఇతరులు ఐదుగురు ఉన్నారు.

ఓటరు స్లిప్పులపంపిణీలో గందరగోళం

ఓటరు స్లిప్పుల పంపిణీలో గందరగోళం నెలకొంది. మరికొన్ని గంటల్లో ఓటింగ్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో స్లిప్పులను పంపిణీ చేయకపోవడం పట్ల ప్రజలు పెదవి విరుస్తున్నారు.ముఖ్యంగా యలమంచిలి పట్టణం, నియోజకవర్గంలోని మండల కేంద్రాల్లో ఓటరు స్లిప్పుల పంపిణీ సక్రమంగా జరగలేదు.ఆదివారం రాత్రి వరకు కూడా పలువురు ఓటర్లకు స్లిప్పులు అందలేదు. ఇదిలా ఉండగా ఓటరు స్లిప్పులని పంచే విషయంలో కొన్ని ఇబ్బందులు వచ్చాయని బీఎల్‌వోలు తెలిపారు. అద్దెకు ఉండే వాళ్లు తమ చిరునామాను మార్చి ఇతర ప్రాంతాలకు వెళ్లారని..కొందరు స్థానికంగా అందుబాటులో లేరని తెలిపారు.

రాంబిల్లిలో..

రాంబిల్లి: మండలంలో 51 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో మొత్తం 42,134 ఓటర్లుండగా, వీరిలో 20,484 మంది పురుషులు, 21,650 మంది మహిళా ఓటర్లున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద నిబంధనల ప్రకారం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ అప్పలస్వామి తెలిపారు.

మునగపాకలో...

మునగపాక:మండలంలోని పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రం ఉద్యోగులు మెటీరియల్‌తో చేరుకున్నారు. పోలీసు అధికారుల పర్యవేక్షణలో యలమంచిలి నుంచి పలు బస్సుల్లో ఉద్యోగులు వచ్చారు. రూట్ ఆఫీసర్ పర్యవేక్షణలో మండలంలోని అన్ని కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది చేరుకున్నట్లు ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు. 56 పోలింగ్ కేంద్రాల్లో 45,414 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

కశింకోటలో...

కశింకోట: మండలంలో 71 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. 54,487 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించడానికి అవసరమైన పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నట్టు సీఐ ఎం.వినోద్‌బాబు తెలిపారు. ఎన్నికలు సజావుగా జరగడానికి ప్రజలు సహకరించాలని కోరారు.


మునగపాకలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి మెటీరియల్‌తో వస్తున్న ఉద్యోగులు


రాంబిల్లి పోలింగ్ కేంద్రం


రాంబిల్లిలో ఎన్నికల సిబ్బందిని తరలిస్తున్న బస్సు


కశింకోటలో పోలింగ్‌కు సన్నద్ధమవుతున్న సిబ్బంది

నేడు ప్రగతి.. నాడు అధోగతి


కొండకర్ల ఆవలో ఏర్పాటు చేసిన ఫైబర్ బ్రిడ్జ్


అచ్యుతాపురం సెజ్ ముఖ ద్వారం రోడ్డు


అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పారిశ్రామిక, పర్యాటక రంగాల్లో అభివృద్ధి
- టీడీపీ హయాంలో అంతా అవినీతిమయం
- టీడీపీ పొత్తుతో ఉన్న జనసేన గెలిస్తే పాత రోజులు వస్తాయని భయపడుతున్న జనం
- ఈసారి కూడా వైఎస్సార్‌సీపీ వైపే ఓటర్ల చూపు

అచ్యుతాపురం: ఈ ఐదేళ్లలో యలమంచిలి నియోజకవర్గంలో జగనన్న సంక్షేమ పాలన సాగింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చడంతో ప్రగతి పథంలో పరుగులు తీసింది. సంక్షేమ పథకాలతో పేదల గతి మారింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు రాజ్యమేలాయి. సంక్షేమాన్ని పక్కన పెట్టి సంక్షోభాన్ని సృష్టించాయి. అందినకాడికి దోచుకున్నాయి. ఇప్పుడు ప్రజల చేతికి మళ్లీ వజ్రాయుధం వచ్చింది. ఈ నేపథ్యంలో టీడీపీ హయాంలో జరిగిన దోపిడీని నియోజకవర్గ వాసులు గుర్తుతెచ్చుకుంటున్నారు. ఆ పార్టీతో పొత్తులో ఉన్న జనసేన అభ్యర్థి గెలిస్తే పాతరోజులు దాపురిస్తాయని భయపడుతున్నారు. ఈ క్రమంలో యలమంచిలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ ప్రభుత్వాల్లో జరిగిన అభివృద్ధి,పాలనా అంశాలపై 'సాక్షి' కథనం.


పర్యాటకం.. 'హబ్'వృద్ధి

సముద్ర తీరానికి అనుకొని ఉన్న యలమంచిలి నియోజక వర్గం రూపురేఖలు పూర్తిగా మారాయి. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి చలువతో సెజ్ ఏర్పాటు చేసిన తర్వాత యలమంచిలి నియోజకవర్గం అందరి దృష్టిని ఆకర్షించింది. ఇప్పుడు దివంగత సీఎం రాజశేఖర్ రెడ్డి తనయుడు జగన్‌మోహన్ రెడ్డి పాలనలో యలమంచిలి నియోజక వర్గం ప్రగతి పథంలో పయనించింది.పర్యాటక ప్రాంతంగా, పరిశ్రమల హబ్‌గా అభివృద్ధి సాధించడంతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించాయి. దీర్ఘకాలిక సమస్యగా ఉన్న యలమంచిలి ఫ్లైఓవర్‌ను పూర్తి చేశారు.అచ్యుతాపురం-పూడిమడక రహదారిని పక్కాగా నిర్మించారు.పూడిమడక ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. నేడు-నేడులో భాగంగా ఆస్పత్రులను, ప్రభుత్వ బడులను అభివృద్ధి చేశారు. రైతులకు సంపూర్ణ సేవలందించే రైతు భరోసా కేంద్రాలను అందుబాటులోకి తెచ్చారు. రైతులు పడిగాపులు కాయవలసిన అవసరం లేకుండా విత్తనాలు సకాలంలో అందజేశారు. వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే ఫించన్‌ను అందించే కార్యక్రమం చేపట్టారు. అచ్యుతాపురం మండలం పారిశ్రామిక వాడగా అభివృద్ధి చెందింది. 134 పరిశ్రమలు ప్రస్తుతం కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. వీటిలో బ్రాండిక్స్, ఏసియన్ పెయింట్స్,ఎకోహమా వంటి కంపెనీలు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. పూడిమడకలో 346 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కొండకర్ల ఆవకు మరిన్ని అదనపు హంగులు కల్పించే విధంగా పర్యాటక శాఖ కృషి చేస్తోంది. పీహెచ్‌సీలను అధునాతనంగా నిర్మించి ఇద్దరేసి వైద్యులను నియమించారు. పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉంచారు. ఫ్యామిలీ ఫిజీషియన్,జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా బడుగు,బలహీన వర్గాలకు మెరుగైన వైద్య సేవలందించారు.

హామీలు తూచ్.. అవినీతి హెచ్చు

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలు కనీస స్థాయిలో కూడా నెరవేరలేదు. జన్మభూమి కమిటీల పెత్తనంతో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయి.

- అచ్యుతాపురం నుంచి అనకాపల్లి వరకూ రోడ్డు విస్తరిస్తామని టీడీపీ నేతలు ఇచ్చిన హామీ నెరవేర్చలేకపోయారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈ సమస్య పరిష్కారమైంది.
- పూడిమడక మత్స్యకారులకు ఇవ్వాల్సిన ప్యాకేజీ విషయంలో టీడీపీ హయాంలో పూర్తిగా న్యాయం జరగలేదు.
- బార్క్‌కోసం తంతడి పరిధిలో భూములు సేకరించారు. పరిహారం అందజేసేందుకు జరిగిన ఎంపికలో అవకతవకలు జరిగాయి.
- తుపాను సమయంలో 2012లో మునగపాక మండలంలోని లోతట్టు ప్రాంతాలైన చూచుకొండ,గణపర్తి గ్రామాలను తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ప్రతిపక్ష నేత హోదాలో సందర్శించారు. తాను అధికారంలోకి వస్తే ముంపు ప్రాంతాల్లో సమస్య పరిష్కారానికి జీ ప్లస్ వన్ పథకాన్ని అమలు చేస్తానని హామీ ఇచ్చారు. 2014లో అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీని విస్మరించారు. ఐదేళ్ల కాలంలో ముంపు సమస్య పరిష్కారానికి నోచుకోలేదు.
- 2015లో అనకాపల్లి పర్యటనకు వచ్చిన చంద్రబాబు ఉమ్మలాడ శారదానది వద్ద గొడారి ఆనకట్ట నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఆ తరువాత టీడీపీ ప్రభుత్వంలో ఆనకట్ట జోలికి పోలేదు. దీంతో బూటకపు హామీలు గుప్పించడం చంద్రబాబుకు అలవాటైపోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.
- రాంబిల్లి మండలంలో గోకివాడ వద్ద ఆనకట్ట పునర్నిర్మాణానికి ఇచ్చిన హామీని చంద్రబాబు నెరవేర్చలేదు.రజాల వద్ద శారద నదిపై వంతెన నిర్మాణం హామీ కూడా అమలుకు నోచుకోలేదు.
- కొండకర్లను పర్యాటక రంగంగా అభివృద్ధి చేస్తామని చెప్పి విస్మరించారు.
- హుద్‌హుద్ తుపాను సమయంలో టీడీపీ నేతలు అవినీతి,అక్రమాలకు పాల్పడ్డారు. కొబ్బరిచెట్లు లేకుండానే తుపానులో చెట్లుకోల్పోయినట్టు పలువురునేతలు పరిహారం పొందారు. ఒక్కోకొబ్బరిచెట్టుకు రూ.వెయ్యిచొప్పును జేబులో వేసుకున్నారు.
- టీడీపీ హయాంలో నియమితులైన అనధికార మండల ఇన్‌చార్జుల ఆధ్వర్యంలోనే ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించండతో అవినీతి రాజ్యమేలింది.



అనకాపల్లి సినిమాలు

ప్రసన్న వదనం	: రాజా
లక్ష్మీకటాక్షం	: సత్యనారాయణస్క్రీన్-1
కింగ్‌డమ్‌ప్లానెట్	
అఫ్ ఏపీఈఅస్	: సత్యనారాయణస్క్రీన్-2
బాక్	: షిర్డిసాయి
ఆ ఒక్కటే అడక్కు	: షిర్డిసాయి
ప్రతినిధి	: వెంకటేశ్వర
రత్నం	: శ్రీసత్య
కృష్ణమ్మ	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 39 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-3 యూనిట్లు, బి పాజిటివ్-14 యూనిట్లు, బి నెగిటివ్-1 యూనిట్, ఒ పాజిటివ్-15 యూనిట్లు, ఒ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 201 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 106 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

వైద్య పరీక్షలు తప్పనిసరి

అనకాపల్లి: మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి వ్యక్తి వయస్సుతో సంబంధం లేకుండా వైద్యుల సూచనల ఏడాదికి రెండు సార్లు మేరకు వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఎన్టీఆర్ వైద్యాలయం విశ్రాంతి వైద్యుడు డి.సాంబమూర్తి తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఆరోగ్య వేదికను 2016లో స్థాపించినట్టు చెప్పారు. ఈ వేదిక ఆధ్వర్యంలో ప్రతి రెండు నెలలకు ఒకసారి ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తూ పెద్ద ఎత్తున వైద్య పరీక్షలు జరిపి, ఉచితంగా మందులు అందజేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు మీనేంద్ర కుమార్, వేదిక సభ్యులు, రోగులు పాల్గొన్నారు.


మందులు అందజేస్తున్న డాక్టర్ సాంబమూర్తి

ఎన్నికల వేళ పలకరించిన వరుణుడు

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డులోని అసంగానంద ఆశ్రమం ప్రాంగణంలో నిర్మించిన మృత్యుంజయేశ్వర ఆలయ సముదాయంలో శంకర జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఆదిశంకరుల విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం ఆధ్యాత్మిక గీతాలాపన, భజన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా శంకర జయంతి

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డులోని అసంగానంద ఆశ్రమం ప్రాంగణంలో నిర్మించిన మృత్యుంజయేశ్వర ఆలయ సముదాయంలో శంకర జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఆదిశంకరుల విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం ఆధ్యాత్మిక గీతాలాపన, భజన కార్యక్రమం నిర్వహించారు.


ఆలయ ప్రాంగణంలో భజన చేస్తున్న భక్తులు

గంగాలమ్మతల్లి గుడి నిర్మాణానికి విరాళాలు

మునగపాక: మండలంలోని మూలపేటలో నిర్మిస్తున్న గంగాలమ్మ తల్లి ఆలయానికి భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. ఆదివారం మునగపాకకు చెందిన ధర్మ జగన్నాథరావు-అచ్యుతగౌరీ దంపతులు రూ.5116, వెలగా ధర్మసూరి అప్పలనాయుడు-పద్మలత దంపతులు రూ.5116, గంగ సూరప్పారావు-కుమారి దంపతుల కుమారులు రమేష్,లీలా మహేష్‌లు రూ.11,111 నగదును విరాళంగా అందజేశారు.


మూలపేటలోని గంగాలమ్మతల్లి గుడికి విరాళం అందజేస్తున్న భక్తులు

ఓటేసే ముందు.. ఒక్క క్షణం

ఇంటి నుంచి బయలుదేరినప్పుడు
నీ పరిసరాలు చూడు
దారిపొడవునా కళకళలాడుతున్న
రహదారులు
నీ పాదాలను ముద్దాడుతున్నది
ఆ అభివృద్ధిని ఆనందించు
చదువుల తల్లి కొలువును చూడు
గోడలపై స్ఫూర్తి నింపే స్వాతంత్ర్య
సమరవీరులను చూడు
రూపురేఖలు మారిపోయిన
బడి అందం చూడు
కార్పొరేట్ లుక్‌తో తళతళలాడుతున్న
వైనం చూడు
ఆ ఆనందంతో మనసు పులకరిస్తుంది
విశాఖ అందం చూడు
కళ్లు జిగేల్‌మనే అభివృద్ధి చూడు
గతంలో ఎన్నడూ లేని సౌకర్యాలు చూడు
మరో లోకంగా కనిపిస్తున్న సాగరతీరం
వైభవం చూడు
అభివృద్ధి అంటే ఇదీ అనిపిస్తుంది.
ఓటరన్నా నువ్వు ఓడిపోవద్దు
విశాఖను ఓడనివ్వొద్దు

శ్రద్ధతో.. అంతఃకరణ శుద్ధితో..

- అబద్ధాలవాదులకు శాశ్వతంగా బుద్ధి చెప్పే సమయమిదే..
- అభివృద్ధి కొనసాగింపే లక్ష్యంగా ఓటు వేద్దాం

ఓటరన్నా.. నమస్తే..

ఎలా ఉన్నావ్? ఐదేళ్ల తర్వాత నిన్ను మళ్లీ కలుసుకున్నందుకు చాలా సంతోషం. చాలా హుషారుగా కనిపిస్తున్నావ్. 2019లో నిన్ను కలిసినప్పుడు జీవితంలో ఏదో కోల్పోయినట్లు కనిపించావ్. ఇప్పుడా నిస్తేజం నీలో లేదు. నీ జీవిత గమనంలో 18వ ఏట అడుగు పెట్టినప్పటి నుంచి ఇన్నాళ్లకు కొత్త ఉషస్సులు చూస్తున్నాను. నీకున్న ఆయుధాల్లో నేను చాలా ప్రత్యేకం. నిన్ను పాలించే వ్యక్తిని, రాష్ట్రాన్ని గాడిలో పెట్టే ప్రభుత్వాన్ని నీవే ఎన్నుకునే అద్భుతమైన శక్తి కలిగిన నీ చేతిలోని పాశుపతాస్త్రాన్ని నేను. నీలో భాగాన్నైన నేను నిన్ను అర్థించేదొక్కటే.. నాకు నీవిచ్చే విలువెంతో గుర్తించు.. ఐదేళ్ల పాటు నీ ప్రాంతాన్ని పరిపాలిస్తూ.. సమస్యలు చెప్పుకునేందుకు అందుబాటులో ఉండే వ్యక్తిని జాగ్రత్తగా ఎంపిక చేసుకో. ఎందుకంటే మంచి వ్యక్తిని, సుపరిపాలన అందించే నాయకుడిని ఎన్నుకుంటే ఐదేళ్ల పాటు అధికారంలో నిలబెడతాను. నీవు కోరుకున్న పనులను ఆ నాయకుడితో చేయిస్తాను. కానీ ఆ వ్యక్తి ఎవరో నిర్ణయించాల్సిన అధికారం నీ విజ్ఞతకే విడిచిపెడుతున్నా..





2019లో నువ్వు తీసుకున్న నిర్ణయం.. ఈ ఐదేళ్లలో నీకు కొత్త భవిష్యత్‌ను అందించింది. నీ పిల్లలకు, నీ కుటుంబానికి వెన్నుదన్నుగా నిలబడింది. అప్పుడేదైతే నిర్ణయం తీసుకుని అభివృద్ధి, సంక్షేమ ఫలాలను పొందావో.. మళ్లీ అదే నిర్ణయానికి కట్టుబడి ఉంటావని ఆశిస్తున్నాను. అంతే కానీ మాయ మాటలు చెప్పి.. అబద్ధాల హామీలు గుప్పించి.. ఓటేసే ముందు రోజు మత్తులో ముంచేసి.. వందకు, వెయ్యికి ఆశపెట్టి నిన్ను హీనస్థితికి దిగజార్చి.. ఆనక గద్దెనెక్కాక.. హామీలన్నీ అటకెక్కించే వాళ్లను 2014 నుంచి 2019 వరకూ భరించావు కదా.! వారి పాలనలో రాష్ట్రం ఎంతలా దిగజారిపోయింది? విశాఖలో వీసమెత్తయినా అభివృద్ధి కనిపించిందా.? కానీ.. ఇప్పుడు ఎలా మారిందో గమనించే ఉంటావు.. పల్లె నవ్వింది. పట్నం మెరిసిపోతోంది. మహిళ మురిసిపోతోంది. విద్యార్థుల జీవితాలు వికసిస్తున్నాయి. అందుకే మనస్ఫూర్తిగా ఆలోచించు. నీ అంతరంగాన్ని మేలుకొలుపు. ఓటు అనే బాధ్యతను కచ్చితంగా నిర్వర్తించు. అబద్ధాల కూటమికి శాశ్వతంగా బుద్ధి చెప్పు. సంక్షేమాభివృద్ధితో రాష్ట్రాన్ని నడిపిస్తున్న వారికే పట్టం కట్టేందుకు ప్రయత్నించు.

ఉత్తరాంధ్ర గురించి ఆలోచించారా.?

నువ్వు ప్రతి ఎన్నికల సమయంలో ఓటు వేస్తుంటావ్ కదా.? గతంలో ఏ నాయకుడైనా.. మన ఉత్తరాంధ్ర గురించి ఆలోచించాడా.? లేదు కదా.? మరి ఇప్పుడెందుకు ఉత్తరాంధ్ర వెలిగిపోతోంది.! కారణమేంటో అర్థమైందా? ఎందుకంటే.. దేశంలోనే ద బెస్ట్ సిటీగా ఉన్న విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా ప్రకటించడమే. ఆంధ్ర రాష్ట్రం.. విభజన ఆంధ్రప్రదేశ్ వరకూ ప్రతి ఒక్కరూ విశాఖ రాజధాని అయితే బెస్ట్ అని చెప్పినా పాలకులు పట్టించుకోలేదు. విభజన తర్వాత పచ్చని పంట పొలాల్లో విధ్వంసం సృష్టించి లక్షల కోట్లతో రాజధాని కడతామంటూ గ్రాఫిక్స్ చూపించారు. వేల కోట్లు ఇక్కడ ఖర్చు చేసి ఉంటే.. ఈ పాటికి విశాఖ భవిష్యత్ తద్వారా రాష్ట్ర భవిష్యత్ ఉజ్వలంగా ఉండేది. కానీ 2014–2019 వరకు విశాఖ ప్రతిష్టను భూ కబ్జాలు, గంజాయి, డ్రగ్స్‌తో దిగజార్చేశారు. ఉత్తరాంధ్రను ఉత్త ఆంధ్రగా మార్చేశారు. కానీ ఇప్పుడేమైంది? అదే ఉత్తరాంధ్ర వెలిగిపోతోంది. మరో ఐదేళ్ల కాలంలో ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ రూపంలో గ్రోత్ సిటీగా విశాఖ అభివృద్ధి చెందుతుంది. ఫలితంగా విద్య, ఉద్యోగం, వ్యాపారం, వాణిజ్యం, రవాణా, వ్యవసాయం ఇలా అన్ని రంగాల్లోనూ దేశంలోనే నంబర్‌వన్ నగరంగా దూసుకుపోతుంది. పొరపాటున గ్రాఫిక్స్‌కి మెచ్చి ఓటేస్తే మాత్రం ఉత్తరాంధ్ర, విశాఖ అభివృద్ధి 'భ్రమ'ల్లోనే ఉండిపోతుంది. అంతెందుకు గిరిజన ప్రజలు వైద్యం కోసం ఎలా విలవిల్లాడేవాళ్లో తెలుసుకదా.? డోలి కట్టుకొని గర్భిణులను మైదాన ప్రాంతాలకు తీసుకొచ్చి.. నర్సీపట్నం, అనకాపల్లి, విశాఖ నగరానికి తీసుకొచ్చేవాళ్లు. ఇప్పుడా పరిస్థితి లేదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారిగా ఏజెన్సీలోనే శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారంటే ఎంతలా ఎదిగిందో అర్థం చేసుకోండి. గిరిజన ప్రాంతాలే ఈ ఐదేళ్ల కాలంలో ఇంతలా అభివృద్ధి చెందాయంటే.. ఇక మైదాన ప్రాంతాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు కదా..
అందుకే ఓటేసే ముందు ఒక్కసారి ఆలోచించు..

అన్నట్లు ఒక్క విషయం

ముందు.. నీలో ఉన్న నిర్లిప్తత వీడి.. ఓటు వేసేందుకు వెళ్లు. ఎందుకంటే.. ఓటు హక్కు లేదని చాలా మంది బాధపడుతుంటారు. మరికొందరు వజ్రాయుధంలాంటి ఓటు హక్కు ఉన్నా.. నిర్లక్ష్యంగా వ్యవహరించి ఓటు వేసేందుకు వెళ్లకుండా ఇంట్లో టీవీ చూస్తు, ఫోన్‌తో కాలక్షేపం చేస్తుంటారు. అందుకే.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నియోగించుకునేందుకు పోలింగ్ బూత్‌లకు రండి. ఎందుకంటే.. ఒక్క ఓటు మీ భవిష్యత్‌ని, మీ ప్రాంత భవిష్యత్తుని మార్చేస్తుంది. ఒక్కసారి ఓటు వేసే అవకాశం మిస్ చేసుకుంటే.. ఐదేళ్ల వరకూ మళ్లీరాదు. ఐదేళ్ల తర్వాత ఓటు వేసుకోవచ్చు కదా అని మీరనుకుంటే.. అదే ప్రజాస్వామ్యానికి పెద్ద చేటు. ఎందుకంటే ఐదేళ్లలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటాయి. ఊరితో పాటు ప్రజలందరి భవిష్యత్ మారిపోతుంది. కులం, మతం, ప్రాంతం, రాజకీయం అనే బేధాలు లేకుండా ఎలా అభివృద్ధి జరిగిందో చూశావు కదా. మళ్లీ అదే మంచి జరగాలంటే.. 2019లో ఎలా అయితే మాయగాళ్లకు బుద్ధి చెప్పి.. మంచి నిర్ణయం తీసుకున్నావో.. అదే నిర్ణయాన్ని మరోసారి అమలు చేస్తే.. పిల్లల భవిష్యత్ బంగారుమయం అవుతుందన్న విషయం గుర్తు పెట్టుకో. నువ్వు ఓటెయ్.. మీ పక్కన ఉన్న వాళ్లందరితో ఓటు వేయించు. గత ఎన్నికల్లో ఎంత మంది ఓటు వేయలేదో నీకు తెలుసా? రాష్ట్రంలోనే ఉమ్మడి విశాఖ జిల్లా 71.81 శాతం ఓటింగ్‌తో అట్టడుగున నిలిచింది. భీమిలిలో 73.90, విశాఖ తూర్పులో 64.73, విశాఖ దక్షిణలో 61.15, విశాఖ ఉత్తరలో 62.65, విశాఖ పశ్చిమలో 58.19, గాజువాకలో 65.33 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. అదే అనకాపల్లి జిల్లా చోడవరంలో 84.26, మాడుగులలో 83.59, యలమంచిలిలో 84.49, పాయకరావుపేటలో 81.74, నర్సీపట్నంలో 82.33 శాతం పోలింగ్ నమోదైందంటే.. నగర వాసులు నన్ను వినియోగించుకోవడంలో ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉంది. ఈ సారి జరిగే ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు.. అబద్ధాలకు, అభివృద్ధికీ., విశ్వసనీయతకు, విశ్వాస ఘాతుకానికి మధ్య జరుగుతున్నాయి. కాబట్టి ప్రతి ఓటూ కీలకమే.. అందుకే.. మీతో ఓ ప్రతిజ్ఞ చేయిస్తున్నాను..

'ఓటరు అనే నేను.. శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతాననీ.. రాష్ట్ర భవిష్యత్తుని, దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడేందుకు ఒక ఓటరుగా.. కర్తవ్యాన్ని నిర్వర్తిస్తాననీ, ఎలాంటి ప్రలోభాలకు లొంగిపోకుండా.. పూర్తి స్థాయి స్పృహతో, శ్రద్ధతో, అంతఃకరణ శుద్ధితో కుల, మత భావాలను పక్కన పెట్టి.. సంక్షేమం, అభివృద్ధికి, సుపరిపాలనని ఇంటి చెంతకే చేర్చిన పార్టీకి, అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అందిస్తున్న నిఖార్సైన నాయకుడికి ఓటు వేసి.. రాజ్యాంగం నాకు కల్పించే అద్భుతమైన అవకాశాన్ని వినియోగించుకుంటానని భారత రాజ్యాంగం మీద త్రికరణ శుద్ధిగా ప్రమాణం చేస్తున్నాను.'

విజ్ఞతతో ఓటు వేయండి. ఇంకో ఐదేళ్ల పాటు ఉజ్వల భవిష్యత్తు కొనసాగే బాధ్యత ఇక నీ చేతిలోనే ఉంది. నీ కోసం అద్భుతంగా రూపురేఖలు మార్చుకున్న మీ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాల దగ్గర ఎదురు చూస్తుంటాను.

ఇట్లు
పవిత్రమైన ఓటు

– సాక్షి, విశాఖపట్నం

ఔరా! ఇది మన ఊరేనా?



ఐదేళ్ల కిందట ఊళ్లో ఓటేయడానికి వెళ్లిన స్కూల్(పోలింగ్ కేంద్రం) వర్షానికి కారిపోతూ కనిపించేది. నేడో రేపో కూలిపోతుందా? అనిపించేది. ఐదేళ్ల తర్వాత మళ్లీ అదే స్కూల్‌కు ఓటేయడానికి వెళ్తున్న సగటు ఓటరు నాటికి, నేటికీ మారిన పరిస్థితులను గుర్తు చేసుకుంటున్నాడు. ఇంటి నుంచి బయలు దేరిన ఓటరుకు మార్గమధ్యలో ఆ ఊళ్లో వచ్చిన మార్పులను అవలోకనం చేసుకుంటున్నాడు. అప్పట్లో నిరుద్యోగిగా ఉన్న యువకుడు నేడు సచివాలయ ఉద్యోగి అయ్యాడు. డిగ్రీ పూర్తి చేసి ఖాళీగా ఉంటున్న యువతి వలంటీర్‌గా చేరింది. తనకు, తన పిల్లలకు అవసరమైన సర్టిఫికెట్లకు ఎక్కడో దూరంగా ఉన్న మండల కేంద్రానికి కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చింది. అక్కడ లంచాలిస్తేనే గాని సర్టిఫికెట్ చేతికి రాని పరిస్థితి. ఇప్పుడు ఊళ్లోనే సచివాలయాలొచ్చాయి. కావలసిన సర్టిఫికెట్లు పైసా లంచం ఇవ్వకుండానే వెనువెంటనే వచ్చేస్తున్నాయి. నెలనెలా ఇచ్చే రూ.వెయ్యి పెన్షను కోసం అవ్వాతాతలు పంచాయతీ ఆఫీసుల చుట్టూ పడిగాపులు పడే పరిస్థితి ఉండేది. ఇప్పుడు వలంటీర్ల వ్యవస్థ ద్వారా నెలనెలా ఒకటో తేదీనే రూ.3 వేలు వారింటికే తెచ్చి ఇస్తున్నారు. ఏ చిన్న అనారోగ్య సమస్యకైనా అర్థరాత్రో, అపరాత్రో అయినా సుదూర ప్రాంతంలో ఉన్న ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఊళ్లోనే విలేజీ హెల్త్ క్లినిక్ వచ్చింది. ఫ్యామిలీ డాక్టర్ ఇంటికే వచ్చి వైద్యమందించి, మందులిచ్చి వెళ్తున్నాడు. ఖరీఫ్ సీజను మొదలవుతుందంటే చాలు.. రైతుల్లో ఆనందం కంటే ఆందోళనే ఎక్కువగా ఉండేది. విత్తనాలు, ఎరువులకు మండల కేంద్రాలకు వెళ్లి క్యూల్లో నిలబడినా వాటిని దక్కించుకోవడం లక్కీ లాటరీగా మారేది. ఇప్పుడు రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే)ను ఏర్పాటు చేసి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను, వ్యవసాయ, అనుబంధ శాఖ సిబ్బంది అందుబాటులో ఉంచిన పరిస్థితి వచ్చింది. ఒకే ఇంట్లో రెండు మూడు కుటుంబాలతో అవస్థలు పడాల్సిన పరిస్థితి ఉండేది. నేడు జగనన్న కాలనీల ఏర్పాటుతో పేదలందరికీ సొంతింటి కల నెరవేరింది. ఇలా ఊరిపక్కనే వందల ఇళ్లతో మరో కొత్త ఊరు వెలిసింది. ఇక పాడుబడిన బడికి తమ పిల్లలను పంపడానికే భయపడే పరిస్థితి ఉండేది. కాళ్లుచేతులేని కుర్చీలు, విరిగి మూలన పడ్డ బెంచీలు, బల్లలు. ఇప్పుడు నాడు–నేడులో ఆ స్కూలు సరికొత్త రూపును సంతరించుకుంది. డిజిటల్ క్లాసు రూమ్‌లు, బెంచీలు, గ్రీన్ బోర్డులు, బైజూస్ కంటెంట్, ఇంగ్లిష్ మీడియంలో బోధన, ఆర్వో ప్లాంటు, పరిశుభ్రత కలిగిన మరుగుదొడ్లతో కార్పొరేట్ స్కూలునే మరిపిస్తోంది. గత ఎన్నికల్లో ఓటేసిన స్కూలే ఇప్పుడు సకల సదుపాయాలతో రూపురేఖలను మార్చేసుకుంది. ఇప్పుడు ఆ పాఠశాలలోనే ఓటేయడానికి ఉత్సాహం ఉరకలేస్తోంది. ఇలా ఊళ్లో రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, ఆధునీకరించిన ప్రభుత్వ పాఠశాలలు, సచివాలయాలు వంటివి అభివృద్ధికి, సచివాలయ ఉద్యోగాలు, వలంటీర్లు ఉపాధి అవకాశాల కల్పనకు సజీవ సాక్ష్యాలుగా దర్శనమిస్తున్నాయి. వెరసి ప్రజలకు సుపరిపాలనకు అద్దం పడుతున్నాయి. ఈ ఐదేళ్లలో ఔరా! ఇది మన ఊరా! అన్నట్టుగా మార్పు చేసిన తీరుతో సగటు ఓటరు అచ్చెరువొందుతున్నాడు. తమ ఊళ్లో గతంలో ఏ ప్రభుత్వమూ చేయనన్ని అభివృద్ధి పనులు జరగడాన్ని ఉదహరిస్తున్నాడు. తమకూ, తమ ఊరికి జరిగిన ఉపకారానికి ఓటు ద్వారా రుణం తీర్చుకోవడానికి సిద్ధమవుతున్నాడు. అలవి కాని, అమలు కాని పథకాలకు మోసపోమని గట్టిగా చెబుతున్నాడు.

– సాక్షి, విశాఖపట్నం

ప్రత్యేక ఆకర్షణగా పింక్ పోలింగ్ స్టేషన్

- 19వ వార్డు జాలరిపేటలో ఏర్పాటు చేసిన ఈసీ
- ఇక్కడ విధులు నిర్వహించేది మహిళలే..

పోలింగ్ స్టేషన్ ఎదుట రిసెప్షన్ ఏరియా



ఎంవీపీకాలనీ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈసారి ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా(ఈసీఐ) 'పింక్ పోలింగ్ స్టేషన్' వ్యవస్థను కొత్తగా అందుబాటులోకి తెచ్చింది. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకటి చొప్పున ఈ పింక్ పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా తూర్పు నియోజకవర్గంలోని పెదజాలరిపేటలో పింక్ పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసింది. వుమెన్ మేనేజ్డ్ పోలింగ్ స్టేషన్ పేరిట సిద్ధం చేసింది. పోలింగ్ ఆఫీసర్ నుంచి భద్రతా సిబ్బంది వరకు అందరూ మహిళలే విధులు నిర్వర్తించడం ఈ స్టేషన్ ప్రత్యేకత. పైగా పోలింగ్‌స్టేషన్ అంతా గులాబీ రంగుతో అలంకరించి అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. అందమైన ముఖద్వారంతో పాటు రిసెప్షన్, బెలూన్ డెకరేషన్ కూడిన ద్వారం, టేబుల్స్, ఫర్నిచర్ ఇలా అంతా పింక్ రంగుతో అలంకరించారు. దీంతో ఈ ఎన్నికల్లో ఈ పోలింగ్ స్టేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పోలింగ్ విధుల పట్ల మహిళా సిబ్బందిలో విశ్వాసం నింపడంతో పాటు ఓటర్లకు స్నేహ పూర్వక, ఆహ్లాదకరమైన సేవలు అందించే దిశగా ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. జాలరిపేటలో 160 పోలింగ్ బూత్‌గా దీన్ని తీర్చిదిద్దగా.. 1,500 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 11 మంది మహిళలు ఈ పోలింగ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు.


ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏర్పాటు చేసిన హాల్

ఏజెంట్లకు సూచనలివే..

- పోలింగ్ ఏజెంట్లు ఉదయం 5.30 గంటలకు పోలింగ్ స్టేషన్‌కు చేరుకోవాలి. మాక్ పోల్ ఉదయం 5.30 గంటలకు ప్రారంభమవుతుంది. మాక్ పోల్ చేయాలంటే కనీసం ఇద్దరు ఏజెంట్లు ఉండాలి. ఏజెంట్లు రాని పక్షంలో 15 నిమిషాలు వేచి చూస్తారు. అప్పటికీ రాకపోతే పోలింగ్ సిబ్బందే మాక్ పోల్ చేస్తారు.
- ఏజెంట్లు మాక్ పోలింగ్ జాగ్రత్తగా గమనించాలి. ఏ గుర్తుకు ఎన్ని ఓట్లు వేశారో నోట్ చేసుకుని.. కౌంటింగ్‌లో సరిగా ఉన్నాయో లేదో చూసుకోవాలి.
- మాక్ పోలింగ్ పూర్తి అయిన తర్వాత క్లియర్ బటన్ నొక్కారా లేదా చూడాలి. ఓట్లు క్లియర్ చేసిన తర్వాత సీల్ వేయాలి. అప్పుడు క్లియర్, కౌంట్ బటన్లు పని చేయకుండా మొదటి సీల్ వేస్తారు. వీవీ ప్యాట్‌లను కూడా జాగ్రత్తగా గమనించాలి.
- ఈవీఎంల దగ్గరికి పోలింగ్ సిబ్బంది గానీ, ఏజెంట్లు గానీ ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లకూడదు.
- ఓటు వేయలేని వాళ్లు.. సహాయకులను వాళ్లే తీసుకురావాలి. పోలింగ్ సిబ్బంది సాయం చేయకూడదు.
- ఏజెంట్ల వద్ద ఓటర్ జాబితాలు ఉంటాయి. పోలైన ఓట్లు టిక్ పెట్టుకోవాలి. మధ్య, మధ్యలో ఎన్ని ఓట్లు పోల్ అయ్యాయో చెబుతారు. లెక్క కరెక్ట్‌గా ఉందో లేదో చెక్ చేసుకోవాలి.
- పోలింగ్ అంతా అయిపోయాక క్లోజ్ బటన్ ప్రెస్ చేసి సీల్ చేస్తారు. క్లోజ్ బటన్ నొక్కారో లేదో జాగ్రత్తగా గమనించాలి. చివరకు సీల్ మీద నంబర్ ఉంటుంది. ఆ నంబర్ నోట్ చేసుకోవాలి. ఆ సీల్ మీద పోలింగ్ ఆఫీసర్‌తో పాటు ఏజెంట్లు కూడా సంతకాలు చేయాలి.
- ఈవీఎంల బ్యాటరీ ఆఫ్ చేశారా లేదా అని కూడా చెక్ చేయాలి.
- ఈవీఎంలను క్లాత్ కవర్‌లో పెట్టి లక్కతో సీల్ వేస్తారు. ఆ సీల్ మీద ఏజెంట్ స్పెషల్‌గా ఏదన్నా గుర్తుతో సీల్ వేయవచ్చు. కౌంటింగ్ అప్పుడు మళ్లీ ఇవి అన్ని గుర్తించాల్సి ఉంటుంది.
- ఏజెంట్ల వద్ద ఉన్న జాబితాల ద్వారా దొంగ ఓటర్లను జాగ్రత్తగా గుర్తించాలి.
- పోలింగ్ అయిపోగానే వెళ్లి పోకుండా.. ఈవీఎంలను పోలింగ్ సెంటర్‌లో అప్పగించేంత వరకు జాగ్రత్తగా వహించాలి
- చివరిలో వేసే సీల్ నంబర్, ఏజెంట్ సంతకాలు, ఏజెంట్ వేసే లక్క సీల్ చాలా ముఖ్యం.

ఓటర్లకు సూచనలు

- ఓటింగ్ బూత్‌ల్లో మొబైల్ ఫోన్లను తీసుకెళ్లడంపై కఠినమైన నిషేధం ఉంది. అందుకే మీ మొబైల్‌ని మీ వెంట తీసుకెళ్లకండి.
- ఓటు వేసేటప్పుడు స్లిప్ కనిపించే వరకు(7 సెకన్లు) బటన్‌ను నొక్కి ఉంచండి. ఒక బీప్ ధ్వనిస్తుంది.
- ఈవీఎం మెషీన్‌లోని బటన్‌ను నొక్కినప్పుడు, వీవీపీఏటీ స్లిప్ బయటకు వచ్చే వరకు బటన్ నుంచి వేలిని తీసివేయకూడదని గుర్తుంచుకోండి.
- వీవీపీఏటీ స్లిప్‌తో మీ ఓటును నిర్ధారించుకోండి.

– మహారాణిపేట



ఉద్యోగం వదిలి.. ఉపాధి వైపు కదిలి..!

- రూ.2.26 కోట్లతో టెఫ్లాన్ కోటింగ్ యూనిట్ ఏర్పాటు
- 23 మందికి ఉపాధి అవకాశాలు
- రోజుల వ్యవధిలోనే అన్ని అనుమతులు
- ప్రభుత్వ సహకారంతో మరింత విస్తరణకు సన్నాహాలు
- విశాఖలో మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్త శరణ్య విజయ ప్రస్థానం



హన్స్ పాలిమర్స్ యూనిట్

సాక్షి, విశాఖపట్నం: ఆమె ఎంబీఏ చదువుకున్నారు. ఓ ప్రైవేటు సంస్థలో ఏడాదికి రూ.లక్షలు జీతం ఇచ్చే ఉద్యోగంలో చేరారు. కానీ అంతటితో ఆమె సంతృప్తి చెందలేదు. తన కాళ్లపై తాను నిలబడుతూ పది మందికి ఉపాధి చూపడంలో ఉన్న ఆనందమే వేరు అనుకున్నారు. అదే విషయాన్ని తన కుటుంబ సభ్యులకు చెప్పారు. వారూ ఆమెకు అండగా నిలిచారు. అంతే హైదరాబాద్‌లో చేస్తున్న ఉద్యోగాన్ని వదిలిపెట్టారు. 2019లో విశాఖ వచ్చారు. విశాఖలో ఫార్మా కంపెనీలకు అవసరమైన టెఫ్లాన్ కోటింగ్‌కు మంచి డిమాండ్ ఉందని తెలుసుకున్నారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారులను కలిసి టెఫ్లాన్ కోటింగ్ యూనిట్‌ను నెలకొల్పాలన్న తన ఆలోచనను వివరించారు. అధికారులు సానుకూలంగా స్పందించారు. దీంతో ఆమె ఈ యూనిట్ ఏర్పాటుకు దరఖాస్తు చేశారు. రోజుల వ్యవధిలోనే అందుకు అవసరమైన అన్ని అనుమతులూ చకచకా వచ్చేశాయి. ఆపై బ్యాంకు రుణం కూడా మంజూరైంది. ఆ వెనువెంటనే యూనిట్ స్థాపన జరిగిపోయింది. ఆ టెఫ్లాన్ కోటింగ్ యూనిట్‌కు అధిపతి అయ్యారు. 23 మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. ఇప్పుడామె తన సంకల్పం నెరవేరిందని ఎంతో సంతృప్తిగా ఉన్నారు. ఆమె పేరు గుడువర్తి శరణ్య. ఆమె నడుపుతున్న యూనిట్ పేరు హన్స్ పాలిమర్స్. విశాఖపట్నం జిల్లా అగనంపూడిలో ఉంది. ఈ నాలుగున్నరేళ్లలో విజయ పథంలో, లాభాల బాటలో నడుస్తున్న ×హన్స్ పాలిమర్స్‌÷కు అధినేతగా ఉన్న శరణ్య.. సాటి ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. తన కల సాకారానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సహకారంపై శరణ్య మాటల్లోనే..


టెఫ్లాన్ కోటింగ్ వేసిన ఫార్మా పైపులు

సత్వర అనుమతులను ఊహించలేదు..



ఏదైనా పరిశ్రమ ఏర్పాటు చేయాలంటే ప్రభుత్వం నుంచి అనుమతులకు ఎంతో సమయం పడుతుంది.. సంబంధిత అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వస్తుందని విన్నాం. హైదరాబాద్‌లో మా సమీప బంధువుల ఇలాంటి పరిశ్రమ కోసం ఎన్నాళ్లో వేచి చూడాల్సి వచ్చింది. అక్కడ ప్రతి అనుమతికి దరఖాస్తుదారుడే వెళ్లాల్సి వచ్చేది. ఫోన్లు చేసినా సరైన స్పందన ఉండేది కాదు. దాన్ని దృష్టిలో ఉంచుకుని కొత్తగా విశాఖ వచ్చిన మాకు.. ఇక్కడ యూనిట్ మంజూరుకు ఎన్నాళ్లు తిరగాలోనని అనుకునే వాళ్లం. కానీ ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి అందుకు పూర్తి భిన్నం. సింగిల్ డెస్క్ పోర్టల్ విధానంలో పరిశ్రమ ఏర్పాటుకు దరఖాస్తు చేసినప్పట్నుంచి అన్నీ సంబంధిత అధికారులే చూసుకున్నారు. దరఖాస్తు స్టేటస్‌ను ఎప్పటికప్పుడు వారే మాకు ఫోన్ల ద్వారా వివరించే వారు. మేం మరిచిపోయినా వారే గుర్తు చేసేవారు. మా యూనిట్ మంజూరుకు కనీసం నాలుగైదు నెలలైనా సమయం పడుతుందనుకున్నాం. కానీ ఊహించని విధంగా దరఖాస్తు చేసిన నెల రోజుల్లోపే అన్ని అనుమతులూ మంజూరైపోయాయి. వెంటనే యూనిట్‌ను స్థాపించాం. రూ.2.26 కోట్ల పెట్టుబడితో రూ.3 కోట్ల వార్షిక టర్నోవర్‌కు చేరుకున్నాం. 23 మందికి ఉపాధి చూపుతున్నానన్న సంతృప్తి నాకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సహకారంతో మా వ్యాపారాన్ని మరింతగా విస్తరించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

– జి.శరణ్య, హన్స్ పాలిమర్స్ అధినేత.

యూనిట్ పేరు	: హన్స్ పాలిమర్స్
ఉత్పత్తి	: టెఫ్లాన్ పెయింట్ తయారీ
యజమాని పేరు	: శరణ్య
పెట్టుబడి	: రూ.2.26 కోట్లు
వార్షిక టర్నోవర్	: రూ.3 కోట్లు
ఉపాధి	: 23 మందికి
కేటగిరి	: చిన్న తరహా పరిశ్రమ
ప్రాంతం	: అగనంపూడి, విశాఖపట్నం